అపర్ణ గ్రాండే లడ్డూ @ రూ.7.50లక్షలు

గణేష్ ఉత్సవాల్లో భాగంగా లడ్డూల వేలం పాట కొనసాగుతోంది. బుధవారం రాత్రి శేరిలింగంపల్లి నల్లగండ్లలోని అపర్ణ గ్రాండేలో గణేష్ లడ్డూను వేలంలో ఎఫ్-బ్లాక్‌కు చెందిన మిలన్ దంపతులు రూ.7.50లక్షలకు దక్కించుకున్నారు.

– శేరిలింగంపల్లి



అపర్ణ సరోవర్ లడ్డూ @ రూ.6.51లక్షలు

నల్లగండ్ల అపర్ణా సరోవర్ లడ్డూ రూ.6.51 లక్షలు పలికింది. అపర్ణా సరోవర్ గేటెడ్ కమ్యూనిటీలో గణేష్ ఉత్సవ సమితి 13వ వార్షికోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లడ్డూ వేలంపాటలు నిర్వహించగా అందులో ఫ్లాట్ నెంబర్ హెచ్ 1104కు చెందిన ఆరుష్, ఆద్యా, సురేష్ కుటుంబం రూ.6.51 లక్షలకు దక్కించుకున్నారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు వారికి ప్రత్యేక పూజలను నిర్వహించి లడ్డూను అందించారు.

– శేరిలింగంపల్లి



భక్తిశ్రద్ధలతో గణేషుడి పూజలు

వినాయకచవితి ఉత్సవాలు శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. కొండాపూర్, గచిబ్చౌలి, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్, హఫీజ్‌పేట్, మాదాపూర్ డివిజన్లలో గణనాథులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఈ సందర్భంగా స్థానికులు పాల్గొని పూజల తర్వాత గణేషుడిని దర్శించుకుంటున్నారు. అన్నదాన కార్యక్రమాలతో పాటు నిమజ్జనాల ఊరేగింపులు కొనసాగుతున్నాయి.

– శేరిలింగంపల్లి


శేరిలింగంపల్లిలోని గణేషుడి పూజల్లో పాల్గొన్న కాంగ్రెస్‌పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జీ జగదీశ్వర్‌గౌడ్


గచ్చిబౌలిలోని శివసాయి క్షేత్రంలో గణేషుడికి ప్రత్యేక అలంకారం చేసిన దృశ్యం


గోపన్‌పల్లిలోని వివాంటీస్ గేటెడ్ కమ్యూనిటీలో కొలువుదీరిని గణనాథుడి వద్ద నిర్వాహకులు


రాయదుర్గం లోని గణేషుడి వద్ద బీజేపీ నాయకుడు మూల అనీల్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు


రాయదుర్గంలోని గణేషుడి వద్ద పూజల్లో పాల్గొన్న స్థానికులు



శేరిలింగంపల్లిలోని లక్ష్మీవిహార్ గేటెడ్ కమ్యూనిటీ గణనాథుడి పూజల్లో స్థానికులు

నవ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులు : ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: నవ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం ఏర్పాటు చేసిన నియోజకవర్గస్థాయి ప్రభుత్వ పాఠశాల గురుపూజోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొని వస్తున్నట్లు తెలిపారు. 25 సంవత్సరాలుగా ఏటా గురుపూజోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేసి, ఉత్తమ గురువులను సన్మానించడం సంతోషకరంగా ఉందన్నారు.విద్యార్థులకు చదువుతోపాటు నైతిక విలువలు బోధించాలని, క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా కార్యక్రమాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని ప్రతి పాఠశాలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దామన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారులు పీపీ రాథోడ్, జెమిని కుమారి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దైవచింతనతోనే మానసిక ప్రశాంతత : ఆర్టీసీ ఎండి సజ్జనార్

పటాన్‌చెరు టౌన్: దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అన్నారు. లింగంపల్లి సమీపంలోని తన స్వగృహంలో ప్రతిష్ఠించిన గణనాథున్ని బుధవారం రాత్రి అమీన్‌పూర్ మండలం బీరంగూడ లోని భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంతంలో ఉన్న పురాతన బావిలో నిమజ్జనం చేసేందుకు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. ఈ సందర్భంగా గణనాథునికి పూజలు చేసి, అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న పురాతన బావిలో నిమజ్జనం చేశారు. అర్చకులు,అమీన్‌పూర్ సీఐ సదా నాగరాజు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యం

మియాపూర్: ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ మదీనగూడలోని దీప్తిశ్రీనగర్ క్లాసికల్ అపార్టుమెంట్‌లో నివాసముంటున్న సోమేశ్వర్‌రావు(62) ఈ నెల 9వ తేదీన రాత్రి 7.20గంటలకు వారు ఉంటున్న అపార్ట్‌మెంట్ నుంచి బయటకు వెళ్లాడు. మరలా ఎంతకి ఇంటికి తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల బంధువులు, స్నేహితులలో ఇళ్లల్లో ఎంతవెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఆందోళన చెంది కూతురు శ్వేతా కుమారి మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మరో ఘటనలో వ్యక్తి..

ఓ వ్యక్తి ఇంటి నుంచి వెళ్లి మరలా ఇంటికి తిరిగిరాని సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ మాణిక్యం తెలిపిన వివరాల ప్రకారం... నిజాంబాద్ ఆర్మూర్ మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన పల్లపు గంగాధర్(53) కుటుంబ సభ్యులతో కలిసి మియాపూర్ హఫీజ్‌పేట్ ప్రకాష్‌నగర్ వడ్డెరబస్తీలో నివాసముంటు కూలీ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో గంగాధర్ ఈనెల 8వ తేదీన ఉదయం 6గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఫోన్ ఇంట్లోనే వదిలి వెళ్లాడు. కుటుంబ సభ్యులు, గంగాధర్ పనికి వెళ్లాడనుకున్నారు. కానీ రాత్రి అయిన కూడా గంగాధర్ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుప్రక్కల, బంధువుల ఇళ్లల్లో ఎంతవెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఆందోళన చెందిన భార్య నర్సమ్మ, మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఈ వ్యక్తుల సమాచారం తెలిస్తే మియాపూర్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని తెలిపారు.

పిల్లలు తగినంత బరువు ఉండాలి


పిల్లల బరువును పరిశీలిస్తున్న ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ మోతి

పటాన్‌చెరు టౌన్: పిల్లలు తగినంత బరువు ఉండేలా చూసుకోవాలని ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ హైదరాబాద్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ మోతి సూచించారు. గురువారం డివిజన్ పరిధిలోని ఆలివ్‌కాలనీ లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని రాష్ట్ర బృందం సభ్యులు స్వరూప, వాసవిలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్‌టీఎస్ (న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం) యాప్ పై పిల్లల ఎత్తు, బరువు వివరాల నమోదును పరిశీలించారు. అనంతరం ప్రీస్కూల్ చిన్నారుల బోధన తీరును పరిశీలించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సల్మా, మనీ పాల్గొన్నారు.

హర్షం వ్యక్తం చేసిన కమ్యూనిటీ ఆర్గనైజర్లు

మూసాపేట: జీహెచ్‌ఎంసీ స్టాండ్ కమిటీ సమావేశంలో యూసీడీ విభాగంలో పనిచేస్తున్న కమ్యూనిటీ ఆర్గనైజర్లకు జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ వర్తింపజేయడానికి స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి, జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మికి, జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు, యూసీడీ విభాగం అదనపు కమిషనర్‌కు యూనియన్ తరపున గురువారం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సాయికృష్ణ, కార్యదర్శి శ్రీకాంత్, ట్రెజరర్ సైదులు, మీడియా కో ఆర్డినేటర్ మురళి, యూనియన్ నాయకులు తాజుద్దీన్, బాప్‌సింగ్, రాంబాబు, యాకయ్య, ఉపేందర్ పాల్గొన్నారు.

ఎస్ఎస్ఆర్ సర్వేకు సహకరించాలి

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశంలో ఈఆర్ఓ ముకుంద్‌రెడ్డి

శేరిలింగంపల్లి: ఓటరు జాబితా స్పెషల్ సమ్మరి రివిజన్ (ఎస్ఎస్ఆర్) 2025 సర్వే కోసం ఇంటింటికి వచ్చే బీఎల్ఓలకు సహకరించాలని శేరిలింగంపల్లి ఈఆర్ఓ, డిప్యూటీ కమిషనర్ ముకుంద్ రెడ్డి తెలిపారు. గురువారం శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో ఓటరు జాబితా స్పెషల్ సమ్మరి రివిజన్‌పై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముకుంద్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయ పార్టీల నాయకులు ఓటర్లకు అవగాహన కల్పించి సర్వే కోసం వచ్చే బీఎల్ఓలకు సహకారం అందించాలని కోరారు. అదే విధంగా ఏమైనా సూచనలు ఉన్నా చేయాలన్నారు. బీఎల్ఓలు ఇంటింటికి వెళ్ళి ఫోన్ యాప్‌లో ఓటర్ల వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేస్తారని, ఓటరు జాబితా ప్రకారం ఓటర్లు అక్కడ ఉన్నారా, లేదా ఎక్కడికైనా షిఫ్ట్ అయ్యారా, పేరు నమోదులో తప్పులు ఉన్నా, ఓటరు మరణిస్తే కుటుంబ సభ్యులతో వివరాలు తీసుకొని వాటిని నమోదు చేస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీలు శ్రవణ్ రెడ్డి, ప్రేమ్‌కుమార్, పలు పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.


సర్కిల్ కార్యాలయంలో పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఈఆర్ఓ ముకుంద్‌రెడ్డి

శిల్పకళా వేదికలో హ్యాండ్లూమ్ ఎక్స్‌పో షురూ

● అందుబాటులో 100 స్టాళ్లు ● 16వ తేదీ వరకు కొనసాగింపు

మాదాపూర్: చేనేత రంగం ఒక పరిశ్రమ మాత్రమే కాదని మనదేశ విభిన్న సంప్రదాయాలకు నిదర్శనమని ఉమెన్ సేఫ్టీ వింగ్ (షీ-టీమ్స్), ఇంటర్నేషనల్ పొలిటికల్ సైకాలజిస్ట్ ప్రేరణ సింహ తెలిపారు. మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో గురువారం సిల్క్ ఇండియా హ్యాండ్లూమ్ ఎక్స్‌పోను ఇండియా ఆసియా పసిఫిక్ డా. సుధాజైన్, నిర్వాహకులు జితేందర్‌త్యాగి, సోమనాథ్ బౌమిక్‌లతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నెల 16వ తేదీ వరకు నిర్వహించనున్న ఎక్స్‌పోలో 100పైగా స్టాల్స్ అందుబాటులో ఉన్నాయని అన్నారు. బనారసీ, భాగల్‌పురి సిల్క్, బెంగుళూరు సిల్క్, చెన్నైసిల్క్, మైసూర్‌సిల్క్, ధర్మవరం, పోచంపల్లి, జమ్దానీ, లెనిన్‌కాటన్, టస్సార్, విష్ణుపురి సిల్క్, డ్రెస్ మెటీరియల్, చందేరి వస్త్రాలు ప్రదర్శనలో కొలువుదీరాయి.


ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న ప్రేరణ సింహ, డా. సుధాజైన్

పనుల్లో నాణ్యత పాటించాలి

కూకట్‌పల్లి: సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు.ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని శాతవాహన నగర్ కాలనీలోని రాంకి పెరల్ మెయిన్ గేట్ వద్ద 25 లక్షల రూపాయల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సమ్మారెడ్డి, నరసింహ, యాదిరెడ్డి, పి.విష్ణు, కృష్ణమూర్తి, వెంకటరామిరెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

● పీఏసీ ఛైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ
● ఘనంగా హోప్ ఫౌండేషన్ ఛైర్మన్ కొండ విజయ్‌కుమార్ జన్మదిన వేడుకలు

చందానగర్ : రక్తదానం ప్రాణదానంతో సమానమని పీఏసీ ఛైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరేకపూడి గాంధీ పేర్కొన్నారు. గురువారం హోప్ ఫౌండేషన్ ఛైర్మన్ కొండ విజయ్ కుమార్ జన్మదినం పురస్కరించుకొని చందానగర్‌లోని హోప్ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా పీఏసీ ఛైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండ విజయ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

● అనంతరం ఆయన మాట్లాడుతూ... రక్తదానం ప్రాణదానంతో సమానమని, అందుకు యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలన్నారు. హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నిరంతరం పేదలకు, విద్యార్థులకు తనవంతు సహాయ సహకారాలు అందజేయడం చాలా గొప్ప విషయన్నారు. రానున్న రోజుల్లో కొండ విజయ్ కుమార్ పేదలకు తన సేవలను కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వ గౌడ్, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, నాయకులు రామస్వామి యాదవ్, రఘునాథ్ రెడ్డి, మల్లికార్జున్‌శర్మ, మల్లారెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న పీఏసీ ఛైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, కొండ విజయ్‌కుమార్

25న శాంతిసరోవర్‌లో సెమినార్

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఈనెల 25వ తేదీన ప్రత్యేక సెమినార్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు ఈ సెమినార్‌ను నిర్వహిస్తారు. ఈ సందర్భంగా 'ఇంటిగ్రేషన్ ఆఫ్ సైన్స్ అండ్ స్పిరుచ్వాలిటీ, ది సోర్స్ ఆఫ్ ఇన్‌ఫినైట్ పాసిబిలిటీస్'అనే అంశంపై సెమినార్ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం. 040-23001234లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

పరామర్శ

పటాన్‌చెరు: మాజీ మంత్రి లక్ష్మారెడ్డిని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి గురువారం పరామర్శించారు. లక్ష్మారెడ్డి సతీమణి ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

వృత్తి విద్యా కోర్సుల ఉత్తీర్ణులకు సర్టిఫికెట్లు


యువతులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న డా. కె.నారాయణ, ప్రొ. సాయిలక్ష్మి

చందానగర్: కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లోని చంద్ర రాజేశ్వర రావు ఫౌండేషన్ ఫర్ సోషల్ ప్రోగ్రెస్ ఆధ్వర్యంలో మహిళా సంక్షేమ కేంద్రంలో నిర్వహిస్తున్న వృత్తి విద్య కోర్సులలో ఉత్తీర్ణులైన యువతులకు గురువారం అధ్యక్షుడు డాక్టర్ కె.నారాయణ, రామానంద తీర్థ ఇన్సిట్యూట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సాయిలక్ష్మిలు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలో మహిళల పట్ల జరుగుతున్న అన్యాయాలను ఖండిస్తున్నానన్నారు. చంద్ర రాజేశ్వరరావు స్ఫూర్తితో మహిళలు సమాజ అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరు వారి వృత్తులతో నైపుణ్యతను పెంపొందించుకోవాలని, పూర్తి విశ్వాసంతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ జోస్యభట్ల కల్పన, ట్రైనింగ్ అధికారి డాక్టర్ విహారికృష్ణ, సీఆర్ ఫౌండేషన్ హెల్త్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ కె.రజని, ఏఐటీయుసి మాజీ కార్యదర్శి డాక్టర్ బివి విజయలక్ష్మి, కృష్ణకుమారి, ఆరుట్ల సమత, లలిత, సీఆర్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

కూకట్‌పల్లి: బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీపై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, మహిళలను కించపరిచే వ్యాఖ్యలు చేసినందుకు క్షమాపణ చెప్పాలని ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. నీచ రాజకీయాలకు అడ్రస్‌గా మారిన కౌశిక్‌రెడ్డి ఆడపడుచులను కించపరిచే విధంగా మాట్లాడటం సబబు కాదన్నారు. శేరిలింగంపల్లిలో ఎమ్మెల్యే గాంధీ అందరి మన్ననలు పొంది మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మచ్చలేని వ్యక్తి అని అన్నారు. అలాంటి వ్యక్తిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదన్నారు.

14న చిన్నారులకు డ్రాయింగ్ పోటీలు

నిజాంపేట్: బండారి లేఔట్ సంక్షేమ సంఘం, మధు పెయింట్ ఇనిస్టిట్యూట్, స్టోరీ లైన్ టాయ్స్ అండ్ గిఫ్ట్ షాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 14న బండారి లేఔట్ లోని రోడ్ నెంబర్- 3బీ లో గల కమ్యూనిటీ హాల్‌లో చిన్నారులకు గణేశుని చిత్రాలపై డ్రాయింగ్ కాంపిటీషన్ నిర్వహించనున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పాల్గొన్న చిన్నారులకు ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నారు. డ్రాయింగ్ షీట్ కమిటీ నిర్వాహకులు అందజేస్తారని, మిగతా సామగ్రిని చిన్నారులు తెచ్చుకోవాల్సి ఉంటుందన్నారు. పోటీల్లో పాల్గొనే వారు తమ పేర్లను 13వ తేదీ రాత్రి 7 గంటల లోగా రిజిస్ట్రేషన్ తీసుకోవాలని, ఇతర వివరాలకు 9550887192, 8985362248 నెంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

సీఐఐ నేషనల్ అవార్డుల ప్రదానం

మాదాపూర్: మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో గురువారం కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ) 25వ సీఐఐ నేషనల్ అవార్డ్ ఫర్ ఎక్స్‌లెన్స్ ఇన్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ విజేతలను ప్రకటించారు. వివిధ రంగాల్లో శక్తినిర్వహణలో అత్యుత్తమ విజయాలు, ఆవిష్కరణలను గుర్తించి అందించింది. దేశవ్యాప్తంగా 15కు పైగా రంగాల్లోని 570కి పైగా కంపెనీలు రిజిస్ట్రేషన్ చేసుకోగా చివరి రౌండ్‌కు 207 కంపెనీలు షార్ట్‌లిస్ట్ చేశారు. ఈ కంపెనీలన్నీ శక్తి వినియోగాన్ని గరిష్ఠం చేయడంలో, వినూత్న పరిష్కారాలను అమలు చేయడంలో అత్యున్నత ప్రమాణాలను అమలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎనర్జీ ఎఫిసియన్సీ సెక్రటరీ మిలింద్ డోరే, ఎనర్జీ ఎఫిసియన్సీ కౌన్సిల్ ఛైర్మన్ రవిచంద్రన్ పురుషోత్తమన్, సీఐఐ తెలంగాణ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ డి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రోగ నిరోధక శక్తిని పెంచుకోవాలి


హెచ్‌సీయూలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించిన దృశ్యం

రాయదుర్గం: ప్రతి ఒక్కరూ తమ రోగ నిరోధక శక్తిని పెంపొందించుకోవాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్ నిగమ్ సూచించారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఎన్ఎస్ఎస్ సెల్, హెచ్‌సీయూ ఆధ్వర్యంలో స్వచ్ఛత, ఆరోగ్య రక్షణ కోసం ప్రత్యేక వైద్య శిబిరాన్ని క్యాంపస్‌లోని యూనివర్సిటీ హెల్త్ సెంటర్‌లో గురువారం నిర్వహించారు. ఈ ఆరోగ్య శిబిరాన్ని విసిస్టా సూపర్ స్పెషాలిటీ ఆయుర్వేద సహకారంతో నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడారు. ఇటీవలి కాలంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండ దంతో ఆరోగ్యం పట్ల అందరూ శ్రద్ధ వహించాలన్నారు. యూనివర్సిటీలో కూడా కొంత మంది అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని వారి కోసం శిబిరం ఏర్పాటు చేయడం ఆనందదాయకమని అన్నారు. అందరూ ఆయుర్వేద వైద్యులను సంప్రదించాలని ఆయన సూచించారు. అనంతరం ఆయుర్వేద మందులను ఉచితంగా విద్యార్థులు, ఉద్యోగులకు వారు అందించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రికి చెందిన డాక్టర్ జికేరెడ్డి, డాక్టర్ లక్ష్మీప్రసాద్, డాక్టర్ గాయత్రి వైద్య సేవలను అందించారు. ఈ శిబిరాన్ని హెచ్‌సీయూ వైద్యాధికారులు కెప్టెన్ రవికుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ బి కృష్ణయ్య, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ భీంసింగ్ పర్యవేక్షించారు.

నేడు కూడా...

హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం సైతం కొనసాగుతుందని హెచ్‌సీయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ బి కృష్ణయ్య తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ శిబిరం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.